# ఐశ్వర్య

"కేశవరావు - అంటే ఐశ్వర్య భర్త చనిపోయాడు. పాపం, నీకు తెలుసా?'' ఇంట్లోకి అడుగు పెట్టగానే అమ్మ అంది.

నాకు ఆ మాట వినగానే కళ్ళనీళ్లు వచ్చాయి. ఉద్యోగంలో చేరిన తర్వాత కొన్నాళ్లు సరదాగా సొంతవూళ్ళో గడపవచ్చని శలవు మీద వచ్చిన నాకు ఈ వార్త అశనిపాతమే అయింది.

పెళ్ళయి రెండు సంవత్సరాలు కూడా కాకముందే ఆమె పండంటి జీవితం నాశనమైపోయింది.

ఆరోజు ఉద్యోగం లేదనే వంకతో మామయ్య వచ్చి అడిగినప్పుడు ఐశ్వర్యతో పెళ్ళికి ఒప్పుకోకపోవడంవల్లే మామయ్య పంతం కొద్దీ మరో సంబంధం తీసుకొచ్చి ఐశ్వర్యకి పెళ్ళి చేసేసాడు. మామయ్యతో పాటు నేనూ ఇవాళ ఆమె ఈ స్థితికి రావడానికి కారకుణ్ణి! ఈ ఆలోచన నా మనసుని మెలివేయసాగింది.

ఐశ్వర్యని చూడడానికి మామయ్యా వాళ్ళింటికి బయల్దేరాను. దారి పొగుడునా ఐశ్వర్య గురించే ఆలోచన! ఆమె జీవితం మోడువారిపోవ డానికి వీల్లేదు. ఆమె జీవితాన్ని తిరిగి ఐశ్వర్యవంతం చేయాలి! ఈ ఆలో చనకి వచ్చినతర్వాత మనసు కొద్దిగా కుదుటపడింది.

ఐశ్వర్యని చూడగానే తిరిగి మనసుని మెలిబెట్టినట్లయింది. బొట్టు లేని ఆమె ముఖం, బోసి మెడ.... అంతవరకూ నాలో అణచుకున్న బాధ కట్టలు తెంచుకుంది.

''ఎవరి ఖర్మకు ఎవరు కర్తలు?'' కళ్లు తుడుచుకుంటూ అంది.

'నువ్వారోజు నన్ను పెళ్ళాడివుంటే నాకీ పరిస్థితి వచ్చి వుండేది కాదుకదా?' అని ఆమె అడిగినట్లనిపించింది.

ఒక్క క్షణం ఇద్దరి మధ్యా నిశ్శబ్దం.

''ఐశ్వర్యా! నీ జీవితం ఇలా మోడువారిపోవడానికి వీల్లేదు. ఇప్పుడు నేను మంచి ఉద్యోగస్తుణ్ణి. నిన్ను పెళ్ళి చేసుకుంటానని మామయ్యనడుగుతా.'' చటుక్కున ఆమె చేతులు పుచ్చుకుంటూ ఆవేశంగా అడిగాను.

''మా అబ్బాయి ఏడుస్తున్నాడు. లోపలికి వెళ్తా. ఇప్పుడు నాలోని స్త్రీ భార్యగా సుఖాలకోసం ఎదురు చూడడం లేదు - తల్లిగా తన బాధ్య తల్ని నెమరు వేసుకుంటోంది. వెంటనే నీకు పెళ్ళి చేసెయ్యమని అత్తయ్యకి చెప్తాలే....'' మరో మాటకి అవకాశం ఇవ్వకుండా లోపలికి వెళ్ళిపోతున్న ఐశ్వర్యని ఆశ్చర్యంగా చూస్తూ వుండిపోయాను.

(కలువబాల)